సాక్షి
ఆదిలాబాద్
శనివారం । 4 । ఫిబ్రవరి । 2023



వైభవం.. వెంకన్న కల్యాణం

భీంపూర్ మండలం పిప్పల్‌కోటి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం నిర్వహించిన స్వామివారి కల్యాణం కన్నుల పండువగా సాగింది. 8లో▸



రూ.6లక్షలు నీటిపాలు! 9లో▸

దారి కష్టాల నుంచి గట్టెక్కేందుకు రూ.6లక్షలతో రోడ్డు, కల్వర్టు నిర్మించుకున్నారు ఆ గ్రామస్తులు. అయితే ఇటీవల నిర్మించిన చెక్ డ్యాం బ్యాక్‌వాటర్‌తో వారి శ్రమ నీటిపాలైంది.

గరిష్టం/కనిష్టం
29.0/12.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతంతో పాటు రాత్రి వేళలో చలితీవ్రత పెరగనుంది. వేకువజామున మంచు ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు



యువత చేసిన ట్వీట్

ఎదులాపురం: ట్విట్టర్ వేదికగా మంత్రి కేటీఆర్‌కు జిల్లా యువత నుంచి కృతజ్ఞతలు వెల్లువెత్తాయి. జిల్లా కేంద్రంలో ఐటీ టవర్ నిర్మాణానికి మంత్రితో పాటు స్థానిక ఎమ్మెల్యే జోగు రామన్న చేస్తున్న కృషిని కొనియాడుతూ ప్రశంసలు కురిపించారు. ఐటీ టవర్ నిర్మాణానికి రూ.40 కోట్లు మంజూరు చేసినందుకు జిల్లా యువత, ఐటీ ఉద్యోగులు మంత్రికి సామాజిక మాధ్యమాల్లో కృతజ్ఞత తెలుపుతూ తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

14మంది వైద్యుల నియామకం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్యుల నియామకాల కోసం శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 110 వైద్యపోస్టులు ఖాళీగా ఉండగా 14మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారు. వీరికి నియామక కమిటీ సభ్యులు రత్నాకుమారి, విల్సన్, లక్ష్మీపతి ఇంటర్వ్యూ నిర్వహించి ఎంపిక చేశారు. తాజాగా నియామకం అయిన 14మంది వైద్యులు త్వరలోనే ఆస్పత్రిలో అందుబాటులోకి రానున్నారు.

కంటి వెలుగు పకడ్బందీగా నిర్వహించాలి



స్క్రీనింగ్ తీరును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

జైనథ్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషాషేక్ అన్నారు. మండలంలోని పెండల్‌వాడ, జైనథ్ గ్రామాల్లో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాలను శుక్రవారం తనిఖీ చేశారు. స్క్రీనింగ్ తీరు, వసతులు, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ కంటి పరీక్షలు నిర్వహించి, అద్దాలు అందించాలన్నారు. సర్జరీ ఆవశ్యకత ఉన్న వారికి రిమ్స్‌కు రెఫర్ చేయాలని ఆదేశించారు. ఆయన వెంట స్థానిక నాయకులు, వైద్య సిబ్బంది ఉన్నారు.

సర్టిఫికెట్ల పరిశీలన



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న సిబ్బంది

ఆదిలాబాద్: డీఎల్‌ఈడీ, డీపీఎస్‌ఈ కోర్సుల్లో ప్రవేశాల కోసం డీఈఈ సెట్–2022లో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు డైట్ కళాశాలలో శుక్రవారం సర్టిఫికెట్ల పరిశీలన చేశారు. మొదటి, రెండో విడతల్లో సర్టిఫికెట్ల పరిశీలన చేసుకోని అభ్యర్థులు తొమ్మిది మంది హాజరయ్యారు. సిబ్బంది వారి సర్టిఫికెట్లను పరిశీలించారు. ఈనెల 6 నుంచి 9 వరకు వెబ్‌ఆప్షన్లు ఇచ్చుకోవాలని, 14న సీట్ అలాట్‌మెంట్, 21న కళాశాలలో రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్ తెలిపారు.

బహిరంగ సభను విజయవంతం చేయండి

ఎదులాపురం: జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహ మైదానంలో నెల 5న నిర్వహించనున్న తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘ బహిరంగ సభను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్ ప్రకటనలో తెలిపారు. బహిరంగ సభ మధ్యాహ్నం ఒంటి గంటకు ఉంటుందని, అలాగే ఈ నెల 6న స్థానిక జనార్దన్‌రెడ్డి గార్డెన్‌లో సంఘం రాష్ట్ర ద్వితీయ మహాసభలు ఉంటాయని పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, భద్రాచలం మాజీ ఎంపీ మిడియం బాబురావు, స్థానిక ఎమ్మెల్యే జోగు రామన్న హాజరుకానున్నట్లు తెలిపారు. విద్యార్థులు, యువత, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

పేదల సంక్షేమానికే.. తొలి ప్రాధాన్యం



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్

- అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా కృషి
- విద్య, వైద్య రంగాలపై దృష్టి • భూ సమస్యల పరిష్కారంపై ఫోకస్
- జిల్లా ప్రగతి సాధించేలా ప్రతీ శాఖకు ప్రత్యేక ప్రణాళిక
- 'సాక్షి' ఇంటర్వ్యూలో కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: సంక్షేమ ఫలాలను పేదలకు అందించడమే తన తొలి ప్రాధాన్యత అని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. విద్యాప్రమాణాల పెంపుతో పాటు నాణ్యమైన వైద్యం అందించేలా కృషి చేస్తానని స్పష్టం చేశారు. అన్ని శాఖలతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రజాప్రతినిధుల సహకారంతో జిల్లాను ప్రగతిపథంలో నడిపేందుకు పాటుపడతానని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్హులందరికీ అటవీహక్కు పత్రాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రొటీన్ అడ్మినిస్ట్రేషన్‌కు తాను దూరంగా ఉంటానని, ప్రతీ శాఖలో ప్రగతి సాధించేలా యాక్షన్ ప్లాన్‌ను నిర్దేశించినట్లు పేర్కొన్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన శుక్రవారం 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు.

సాక్షి: జిల్లా అభివృద్ధికి ఎలాంటి ప్రణాళికను సిద్ధం చేశారు..?

కలెక్టర్: రొటీన్ అడ్మినిస్ట్రేషన్‌కు భిన్నంగా ఉంటా. ఉదయం 10 గంటలకు వచ్చి సాయంత్రం 4 గంటలకు వెళ్దామనుకుంటే కుదరదు. ప్రతీ శాఖ గతేడాది సాధించిన ప్రగతితో పోల్చితే 10 నుంచి 20 శాతం అధికంగా సాధించేలా యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేస్తున్నాం. ప్రతినెలా జిల్లా అధికారులతో సమీక్షలు నిర్వహించి ప్రగతిపై ఫోకస్ పెంచుతాం. ప్రగతిలో వెనుకబడిన అధికారులపై చర్యలు తీసుకుంటాం. అలాగే లక్ష్య సాధనలో ముందుండే వారిని ప్రత్యేకంగా అభినందిస్తాం.

సాక్షి: జిల్లా కలెక్టర్‌గా మీ ప్రాధాన్యత అంశాలు..?

కలెక్టర్: ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ, అభివృద్ధి ఫలాలను పేదలకు వందశాతం అందించడమే నా తొలి ప్రాధాన్యత. కంటి వెలుగు, రైతుబంధు, రైతు బీమా వంటి ప్రభుత్వ పథకాలను అర్హులైన వారికి పూర్తిస్థాయిలో అందేలా చూస్తాను. అలాగే పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి వంటి తదితర అభివృద్ధి పథకాలను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలుపరుస్తూ జిల్లాను రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిపేలా పాటుపడతా.

సాక్షి: ఆర్‌వోఎఫ్‌ఆర్ భూముల సర్వే ప్రక్రియ ఎంతవరకు వచ్చింది.. అర్హులైన వారికి పట్టాలు ఎప్పుడు అందజేస్తారు..?

కలెక్టర్: భూముల సర్వే ప్రక్రియ పూర్తయింది. అర్హులైన లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియను డివిజన్, జిల్లా స్థాయిలో నిర్వహించాం. ప్రస్తుతం వారి వివరాల నమోదు ప్రక్రియ కొనసాగుతుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్హులందరికీ అందించేలా చూస్తాం.

సాక్షి: మన ఊరు– మనబడి పనుల్లో నాణ్యత లోపిస్తుంది. పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. ఎప్పటి వరకు పూర్తవుతాయి..?

కలెక్టర్: విద్యారంగంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతాం. ప్రస్తుతం ప్రతీ మండలానికి రెండు పాఠశాలలను మోడల్‌గా తీర్చిదిద్దాం. ఇప్పటికే కొన్ని బడులను ప్రారంభించాం. ఈ విద్యాసంవత్సరం ముగింపు వరకు ప్రతీపాఠశాలను అన్ని వసతులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేలా చర్యలుచేపడతాం.సివిల్ వర్క్స్, ఎన్‌ఆర్‌ఈజీఎస్‌పనులన్నీ పూర్తిచేసి డ్యూయల్ డెస్క్‌లతో సహా నూతన విద్యా సంవత్సరానికి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొస్తాం. పనుల్లో నాణ్యతా లోపం తలెత్తకుండా తగు చర్యలు చేపడతాం.

సాక్షి: ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో మీరు గుర్తించిన తేడా ఏమిటి..?

కలెక్టర్: ఈ రెండు జిల్లాల్లో పెద్ద తేడా ఏమి ఉండదు. రెండు గిరిజన జనాభా కలిగిన జిల్లాలే. ఇక్కడ పనిచేయడం ఎంతో సంతృప్తినిస్తుంది. గిరిజనులకు విద్య, వైద్యం అందించడంతో పాటు పోషకాహార లోపం, ఎనిమియాను దూరం చేసేలా ప్రత్యేక చర్యలు చేపడతాం. పోషణ్ అభియాన్‌ను పకడ్బందీగా అమలు చేసి కేసీఆర్ న్యూట్రిషన్ కిట్‌తో పాటు పోషకాహారం అందించేలా చూస్తాం.

సాక్షి: జిల్లాలో ఏకైక మున్సిపాలిటీ అభివృద్ధికి ఎలా దృష్టి సాధిస్తారు..?

కలెక్టర్: జిల్లాలో ఉన్న గ్రేడ్–1 మున్సిపాలిటీ అభివృద్ధికి అడ్మినిస్ట్రేషన్ పరంగా అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తాం. పారిశుధ్యం, తాగునీటి పరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతాం.

సాక్షి: ఉమ్మడి జిల్లా పేదలకు వరప్రదాయినిగా నిలిచే రిమ్స్ ఆస్పత్రిలో సరైన వైద్యం అందడం లేదనే అభిప్రాయం ఉంది. మెరుగైన వైద్యం అందించేలా ఎలా ముందుకెళ్తారు..?

కలెక్టర్: రిమ్స్ ఆస్పత్రిని సందర్శించి వాటి నిర్వహణ, వైద్యసేవలు తీరును పరిశీలిస్తాం. ఆస్పత్రికి వచ్చే వారికి నాణ్యమైన వైద్యం అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటాం. వైద్యులతో సమావేశం నిర్వహించి తగు సలహాలు, సూచనలు చేస్తాం.

సాక్షి: జిల్లాలో మాతా శిశు మరణాలు ఎక్కువగా ఉన్నాయి. ఏజెన్సీ పరిధిలో మరింత ఎక్కువగా ఉంది. వీటిని ఏవిధంగా అరికడతారు..?

కలెక్టర్: ఆసిఫాబాద్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించినప్పుడు మాతా శిశుమరణాలు 15 ఉండేవి. వాటిపై ప్రత్యేక దృష్టిసారించి చర్యలు చేపట్టి మూడింటికి తీసుకురావడం జరిగింది. జిల్లాలోనూ అదే స్ఫూర్తితో పనిచేస్తూ మాతా శిశు మరణాలను జీరోకు తగ్గించేలా కృషి చేస్తా.

సాక్షి: ఉపాధిహామీ పనుల్లో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. పనులకు వెళ్లకుండా కొందరు బిల్లులు లేపుకుంటున్నారు. వాటిని ఏవిధంగా కట్టడి చేస్తారు..?

కలెక్టర్: ఇదివరకు జరిగినవి ఏమిటో నాకు తెలియదు. ప్రస్తుతం ఉపాధి హామీ పనుల్లో అవినీతి, అక్రమాలకు ఆస్కారం లేకుండా అంతా ఆన్‌లైన్‌లోనే సాగుతుంది. జిల్లాలో కూలీల సంఖ్యను పెంచి వీలైనంతఎక్కువ మందికి ఉపాధి కల్పించేలా చూస్తాం. తద్వారా మెటీరియల్ కంపోనెంట్ పెరిగి అభివృద్ధి పనులకు దోహద పడుతుంది. బోగస్ జాబ్ కార్డులను ఏరివేసేందుకు ఆధార్ సీడింగ్ చేపడుతున్నాం.

సాక్షి: భూసమస్యల పరిష్కారానికి ఎలాంటి కృషి చేస్తారు. ప్రజాఫిర్యాదుల విభాగంలో ఇలాంటివే ఎక్కువగా వస్తున్నాయి..?

కలెక్టర్: భూ సమస్యలన్నింటిని పరిష్కరించేందుకే ప్రభుత్వం ధరణి పోర్టల్ తీసుకొచ్చింది. అన్ని సమస్యలను పరిష్కరించేలా ఆప్షన్ కల్పించారు. చాలా మందికి ఈ విషయం తెలియక గ్రీవెన్స్‌కు వస్తుంటారు. వారికి స్పష్టమైన మార్గనిర్దేశం చేస్తాను. కోర్టు కేసులో ఉంటే తప్పా మిగతా ఎలాంటి భూ సమస్యలున్నా పరిష్కరించేలా చర్యలు చేపడతా. ప్రజలు పదే పదే గ్రీవెన్స్‌కు రాకుండా సమస్యలను పరిష్కరిస్తా.

ఎయిర్‌పోర్ట్.. గగనమే!



జిల్లా కేంద్రంలోని విమానాశ్రయ మైదానం

- జిల్లా కేంద్రంలో ఏర్పాటుపై నీలినీడలు
- రాష్ట్రం పరిధిలోకి నెట్టిన కేంద్రం
- స్థలాన్ని అభివృద్ధి చేసి ప్రారంభించాలని సూచన
- చిన్న విమానాల కోసమేనని స్పష్టం
- ప్రైవేట్ సంస్థలు ముందుకొచ్చేది అనుమానమే

సాక్షి, ఆదిలాబాద్: ఆదిలాబాద్‌లో కొత్తగా విమానాశ్రయ నిర్మాణానికి సాంకేతికంగా అనువైన ప్రదేశమని గుర్తించినట్టు కేంద్రం తెలిపినప్పటికీ ఇక్కడ ఇప్పట్లో ఎయిర్‌పోర్ట్ నిర్మాణం అనుమానంగానే కనిపిస్తోంది. దీనికి కారణం లేకపోలేదు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న స్థలానికి అనుగుణంగా చిన్న విమానాల ప్రైవేట్ కార్యకలాపాల కోసం ఈ స్థలాన్ని అభివృద్ధి చేసి, ప్రారంభించాలని తెలంగాణ ప్రభుత్వానికి ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) సూచించింది. దీంతో బంతి కేంద్రం నుంచి రాష్ట్రం పరిధిలోకి వచ్చింది. గురువారం బీఆర్‌ఎస్ ఎంపీలు పార్లమెంట్‌లో రాష్ట్రంలో ఎయిర్‌పోర్టుల నిర్మాణం విషయంలో అడిగిన ప్రశ్నలకు పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి వీకే సింగ్ పైవిధంగా సమాధానమిచ్చారు. తద్వారా దీని నిర్మాణ విషయంలో సాధ్యాసాధ్యాలపై ప్రశ్న తలెత్తుతోంది.

సాంకేతికంగా అనువైన ప్రదేశమే..

తెలంగాణలో మూడు ప్రాంతాలను మాత్రమే కొత్తగా విమానాశ్రయాల నిర్మాణానికి సాంకేతికంగా అనువైన ప్రదేశాలుగా తాజాగా గుర్తించినట్టు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఇందులో వరంగల్ (బ్రౌన్ ఫీల్డ్), ఆదిలాబాద్ (బ్రౌన్ ఫీల్డ్), జక్రాన్‌పల్లి (గ్రీన్ ఫీల్డ్)లకు మాత్రమే సాంకేతికంగా సాధ్యమయ్యేవని ఏఏఐ నివేదిక స్పష్టం చేసింది. సాంకేతికంగా అనువైందని చెప్పినందుకు సంతోషించాల్సిన విషయమే అయినప్పటికీ ప్రభుత్వ ఎయిర్‌పోర్టు విషయంలో కేంద్రం నుంచి స్పష్టత లేకపోవడం, ప్రైవేట్ విమాన సర్వీసులను నడుపుకునేందుకు అనువుగా అభివృద్ధి చేసుకోవాలని చెబుతూ రాష్ట్రం పరిధిలోకి నెట్టేయడం ద్వారా ఇక ఆదిలాబాద్‌లో ప్రభుత్వ విమానాశ్రయం అనేది ఇప్పట్లో గగనంగానే కనిపిస్తుంది.

సన్నగిల్లుతున్న ఆశలు..

గతంలో ఏఏఐ టీమ్ ఆదిలాబాద్ పట్టణంలోని 369 ఎకరాల ఏరోడ్రమ్ మైదానాన్ని పరిశీలించారు. ఎయిర్‌పోర్ట్ నిర్మిస్తే రన్‌వే కోసం మరో 50 ఎకరాల స్థలం అవసరం పడుతుందని పరిశీలన కూడా చేశారు. దాంతోపాటు మరో 1600 ఎకరాల ప్రైవేట్ భూములు పట్టణ శివారులోని ఖానాపూర్, అనుకుంట, కచ్‌కంటి, తంతోలి గ్రామాల్లో గుర్తించారు. వాటిని సేకరించాల్సి ఉంటుందని అప్పట్లో తెలిపారు. 2014లో ఇది జరిగింది. అప్పట్లో పూర్తిస్థాయి ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ (ఏఎఫ్‌ఎస్) ఏర్పాటు చేస్తారనే ప్రచారం కూడా జరిగింది. మూడున్నరేళ్ల క్రితం ఆదిలాబాద్ జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదిలాబాద్‌లో ఎయిర్‌స్ట్రిప్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. తద్వారా ఇక్కడినుంచి దేశీయ విమానాలను నడపడం జరుగుతుందని పేర్కొన్నారు.

సాధ్యమేనా..

ఆదిలాబాద్‌లో భూమి లభ్యత, వచ్చే 20 ఏళ్లకు విమానయాన పరంగా ప్రయాణికుల శాతం నిష్పత్తి అంచనా వేస్తూ ఇక్కడ ప్రస్తుతానికి దేశీయ విమానాలు నడపవచ్చని ఏఏఐ గతంలోనే స్పష్టం చేసింది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం కొత్త ఎయిర్‌పోర్ట్‌లను ఏర్పాటు చేసే పరిస్థితి లేదని దీనికి సంబంధించిన నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. ఎయిర్‌పోర్టుల ఏర్పాటుకు ప్రతిపాదనలు చేసిన దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోనైనా.. పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) మోడల్‌లో నడపాలని అప్పట్లో సూచించారు. తాజాగా ఇప్పుడు స్థలాభివృద్ధిని కూడా రాష్ట్రం పరిధిలోకే నెట్టేశారు. ఈ అంశం పూర్తిగా ఇప్పుడు రాష్ట్ర పరిధిలోనే ఉంది. సాధారణ ప్రజలకు కూడా విమానయానం కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం 'ఉడే దేశ్‌కా ఆమ్ నాగరిక్' (ఉడాన్) గతంలో ప్రారంభించింది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్, మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు మధ్య కనెక్టివిటి కోసం ఆదిలాబాద్ మీదుగా ఎయిర్‌స్ట్రిప్ నడపాలని యోచించారు. ప్రైవేట్ సంస్థలైన వైమానిక ఆపరేటర్లు ఎవరైనా ముందుకు వస్తే ఈ మార్గంలో విమానాలను నడపాలని చూసింది. అప్పట్లో ఔత్సాహిక వైమానిక ఆపరేటర్ల నుంచి దీనికి సంబంధించి బిడ్లు కోరగా, ఎవరు ముందుకు రాకపోవడంతో కార్యరూపం దాల్చలేదు. ఇక్కడినుంచి దేశీయ విమానాలు నడపడం ద్వారా ప్రధానంగా కార్గో (వస్తు) రవాణాకు ఉపయుక్తంగా ఉంటుందన్న అభిప్రాయం ఉన్నప్పటికీ ఈ మార్గంలో ఆదాయ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ప్రైవేట్ వైమానిక సంస్థలు ముందుకొచ్చే పరిస్థితి ఉంటుందా.. లేదా అనేది వేచిచూడాల్సిందే.

మొదట్లో ఏఎఫ్‌ఎస్ అని, ఆ తర్వాత ఎయిర్‌స్ట్రిప్ అని ప్రభుత్వాలు చెప్పుకుంటూ రావడంపై ఈ ప్రాంతంలో విమానాశ్రయ అభివృద్ధికి పూర్తిస్థాయి చిత్తశుద్ధి చూపలేదన్న విమర్శలు ఉన్నాయి. తాజాగా ఆశలు మరింతగా సన్నగిల్లుతున్నాయి. ఇప్పటికే రైల్వే లైన్ విషయంలో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉంది. ఇక రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాంతంలో విమానాలు నడిపేందుకు స్థలం అభివృద్ధిపై దృష్టి సారిస్తుందా అనేది అనుమానంగానే కనిపిస్తుంది.

బ్రౌన్‌ఫీల్డ్ అంటే..

పట్టణ ప్రణాళికలో బ్రౌన్‌ఫీల్డ్ భూమి అనేది గతంలో అభివృద్ధి చెందిన ఏదైన భూమి. గతంలో పారిశ్రామిక, వాణిజ్య ప్రయోజనాల కోసం ఉపయోగించిన భూమిగా బ్రౌన్‌ఫీల్డ్‌కు అర్థం వస్తుంది. 1930లో అప్పటి హైదరాబాద్ నిజాం యుద్ధ విమానాలకు ఇంధనం నింపడం కోసం ఆదిలాబాద్ పట్టణంలో 369 ఎకరాల విస్తీర్ణంలో విశాలమైన ల్యాండ్‌స్కేప్‌లో ఏరోడ్రోమ్‌ను ఏర్పాటు చేశారు. స్వాతంత్య్రం తర్వాత, ఇది ఐఏఎఫ్ నియంత్రణలోకి వచ్చింది. 1970 చివరి వరకు పైలెట్లకు శిక్షణ ఇచ్చే హెలికాప్టర్లకు ఇంధనం నింపే కేంద్రంగా దీనిని ఉపయోగించారు.

కలెక్టర్‌ను కలిసిన ట్రెజరీ అధికారులు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తూ..

కైలాస్‌నగర్: కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రాహుల్‌రాజ్‌ను జిల్లా ట్రెజరీ అధికారులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన చాంబర్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలను తెలిపారు. ఇందులో ఎస్టీఓలు యు.రాఘవేందర్, షేక్ సిరాజ్, సతీశ్‌సింగ్, ట్రెజరీ అధికారుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐదు మెడికల్ షాపులు సీజ్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మెడికల్ షాపులను జిల్లా డ్రగ్‌ఇన్‌స్పెక్టర్ శ్రీలత శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణను పరిశీలించి మందుల విక్రయాలపై ఆరా తీశారు. నిబంధనలు పాటించని ఐదు మెడికల్ షాపులను సీజ్ చేశారు. కాగా, డిసెంబర్‌లో ఔషధ నియంత్రణ ఏడీ ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టి నోటీసులు జారీ చేసినట్లుగా ఆమె తెలిపారు. వాటిపై వివరణ ఇవ్వకపోవడంతో సీజ్ చేసినట్లుగా వెల్లడించారు.

టీఎల్‌ఎంతో మెరుగైన అభ్యసనం



టీఎల్‌ఎం పంపిణీ చేస్తున్న డీఈవో ప్రణీత

ఆదిలాబాద్: మానసిక వైకల్యం గల చిన్నారులు బోధనోపకరణాల ద్వారా మెరుగ్గా అభ్యసించగలుగుతారని డీఈవో ప్రణీత అన్నారు. జిల్లా కేంద్రంలోని భవిత విలీన విద్యావనరుల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన టీఎల్‌ఎం పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఏడీఐపీ పథకం కింద మంజూరైన టీచింగ్ లర్నింగ్ మెటీరియల్‌ను చిన్నారులకు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. మానసిక వైకల్యం గల వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో అవకాశాలను కల్పిస్తున్నాయన్నారు. వాటిని సద్వినియోగం చేసుకునేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. వారి వైకల్యంపై తల్లిదండ్రులు చింతించకుండా అన్నివిధాలుగా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఐఈ కోఆర్డినేటర్ సుజాత్ ఖాన్, డైట్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్, ఎన్జీవోఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్, ఐఈఆర్పీలు పుష్పవేణి, రాజన్న, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

బదిలీ దరఖాస్తుల పరిశీలన



దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియలో భాగంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తుల పరిశీలన శుక్రవారం చేపట్టారు. డీఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎనిమిది ప్రత్యేక కౌంటర్ల ద్వారా అధికారులు వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. జిల్లాలోని ఇచ్చోడ, సిరికొండ, ఆదిలాబాద్‌రూరల్, ఆదిలాబాద్‌అర్బన్, మావల మండలాలు మినహా మిగతా మండలాలకు సంబంధించిన ఎంఈవోలు దరఖాస్తు ఫారాలను డీఈవో కార్యాలయంలో సమర్పించారు. దాదాపు 900 దరఖాస్తులను అందజేశారు. పరిశీలన అధికా రులు వాటిని పరిశీలించి తప్పులు ఉన్నవాటిని ఎడిట్ చేశారు. ఇదివరకు స్పౌజ్ కేటగిరి వాడుకున్న ఉపాధ్యాయులు మళ్లీ వాడారా అనే విషయాన్ని పరిశీలించి ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ఎన్‌టైటిల్మెంట్ పాయింట్లతో ఉన్నతాధికారులు ఈనెల 7న విడుదల చేయనున్నారు. ఆ తర్వాత ఉపాధ్యాయులు వెబ్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీ కోరుకునే పాఠశాలను ఎంచుకోనున్నట్లు డీఈవో ప్రణీత తెలిపారు.

రేషన్ డీలర్లకూ బయోమెట్రిక్

- ఎంఎల్‌ఎస్ పాయింట్ అక్రమాలకు చెక్
- కార్డుల సంఖ్యకనుగుణంగా బియ్యం పంపిణీ
- ఈ నెల నుంచే అమల్లోకి..

జిల్లాలోని రేషన్ షాపులు	356
ఏఎఫ్‌ఎస్‌సీ కార్డులు	14, 181
ఎఫ్‌ఎస్‌సీ కార్డులు	177646
అన్నపూర్ణకార్డులు	251
ప్రతి నెలా బియ్యం కేటాయింపులు 3,007 మెట్రిక్ టన్నులు	



బయోమెట్రిక్ ప్రక్రియను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ నటరాజ్, డీఎస్‌వో, డీఎం

కైలాస్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం రేషన్ డీలర్లకు కూడా బయోమెట్రిక్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ప్రజాపంపిణీ వ్యవస్థలో రేషన్ షాపుల ద్వారా కార్డుదారులకు ఏ విధంగానైతే బియ్యం పంపిణీ చేస్తున్నారో డీలర్లకు సైతం అదే బయోమెట్రిక్ విధానం అమలుకు శ్రీకారం చుట్టింది. ఈ నెల నుంచే అమల్లోకి తెచ్చింది. దీంతో ప్రతీ డీలర్ సంబంధిత మండల లెవల్ స్టాక్ (ఎంఎల్‌ఎస్)పాయింట్‌కు వెళ్లి తన బయోమెట్రిక్ ద్వారా బియ్యం తీసుకోవాల్సి ఉంటుంది. తద్వారా ఎంఎల్‌ఎస్ పాయింట్‌లో జరిగే అక్రమాలకు చెక్‌పడనుండగా డీలర్‌కు కార్డుల సంఖ్యకనుగుణంగా ఖచ్చితమైన తూకంతో బియ్యం అందే వెసులుబాటు కలుగనుంది.

అక్రమాలకు చెక్ ఇలా..

జిల్లాలో జైనథ్, ఇచ్చోడ, బోథ్, ఉట్నూర్, ఆదిలాబాద్ మండల కేంద్రాల్లో పౌరసరఫరాల సంస్థకు సంబంధించిన ఎంఎల్‌ఎస్ పాయింట్‌లు ఉన్నాయి. వాటి పరిధిలోని రేషన్ షాపులకు ఇక్కడి నుంచే బియ్యం సరఫరా చేస్తారు. ఇది వరకు బ్యాగుల చొప్పున లెక్కించి రేషన్‌షాపులోని కార్డుల సంఖ్యకనుగుణంగా బియ్యం సరఫరా చేసే వారు. ఎంఎల్‌ఎస్ పాయింట్లలో గన్నీబ్యాగులకు ఉద్దేశపూర్వకంగా రంధ్రాలు చేసి బియ్యంను తీసుకునేవారు. దీంతో డీలర్‌కు లెక్కప్రకారం బియ్యం అందేది కాదు. ఇది అందరికీ తెలిసి జరిగే దందా కనుక వారు పెద్దగా పట్టించుకునేవారు కాదు. తాజాగా ఈ వ్యవహారానికి చెక్ పెట్టాలని భావించిన రాష్ట్ర ప్రభుత్వం ఎంఎల్‌ఎస్ పాయింట్‌ల వద్ద కూడా బయోమెట్రిక్ అందుబాటులోకి తెచ్చింది. ప్రతి డీలర్ సంబంధిత ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు వెళ్లి తన బయోమెట్రిక్ ద్వారా నిర్ణీత తూకంతో బియ్యంను తీసుకోవాల్సి ఉంటుంది. దీంతో బియ్యం సరఫరాలో పారదర్శకత పెరగనుండగా డీలర్లకు సైతం ప్రయోజనం చేకూరే అవకాశముందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

ప్రక్రియను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్

రేషన్‌డీలర్లకు బయోమెట్రిక్ ద్వారా బియ్యం పంపిణీ చేసే ప్రక్రియను అడిషనల్ కలెక్టర్ ఎన్.నటరాజ్, డీఎస్‌వో ఎ.కిరణ్‌కుమార్, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ సుధారాణి శుక్రవారం పరిశీలించారు. పకడ్బందీగా నిర్వహించాలని ఎంఎల్‌ఎస్ పాయింట్ ఇన్‌చార్జి మధుకర్‌ను ఆదేశించారు.

జిల్లా జైలులో 'కంటి వెలుగు'



అద్దాలను అందజేస్తున్న డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్, జైలు సూపరింటెండెంట్ అశోక్

కైలాస్‌నగర్: పట్టణంలోని జిల్లా జైలులో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా 128 మంది ఖైదీలు, 30మంది సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి అద్దాలు, మందులను అందించారు. శిబిరాన్ని డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్, జిల్లా జైలు సూపరింటెండెంట్ పి.అశోక్ కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో పీడీవో కె.అనిల్‌కుమార్, వైద్యులు శిల్ప, ఈశ్వర్, జైలర్ సూర్యప్రకాశ్‌రెడ్డి, డిప్యూటీ జైలర్ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

టైరు పగిలి కారు బోల్తా



వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

ఆదిలాబాద్‌రూరల్‌: మండలంలోని రామాయి గ్రామంలోగల ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న శ్రీలత రోజులాగే శుక్రవారం తన కారులో పాఠశాలకు వెళ్తున్నారు. ఈక్రమంలో రాంపూర్‌ సమీపంలో కారు టైరు పగిలింది. దీంతో వాహనం బోల్తా పడింది. ఎలాంటి ప్రమాదం సంభవించకపోవడంతో ఆమె ప్రాణాలతో బయటపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్‌ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



దగ్ధమైన సామగ్రి

లోకేశ్వరం: మండల కేంద్రంలో పెద్దోల్ల పోతన్నకు చెందిన ఇల్లు విద్యుత్‌ షార్ట్‌ సర్క్యూట్‌తో పాక్షికంగా దగ్ధమైంది. ఆర్‌ఐ బాలకిషన్‌, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం పోతన్న తన భార్య భోజవ్వతో కలిసి కూలీ పనులకు వెళ్లాడు. 11గంటల సమయంలో విద్యుత్‌ షార్ట్‌ సర్క్యూట్‌తో నిప్పంటుకొని ఇంట్లోని సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. ఇరుగు పొరుగువారు గమనించి మంటలను ఆర్పివేశారు. రూ.50వేల ఆస్తినష్టం జరిగినట్లు ఆర్‌ఐ బాలకిషన్‌ తెలిపారు.

కుక్కల దాడిలో జింకకు గాయాలు



అధికారులకు జింకను అప్పగిస్తున్న పోలీసులు

తానూరు: మండల కేంద్రంలోని శివారు ప్రాంతంలో శుక్రవారం కుక్కల దాడిలో జింకకు గాయాలయ్యాయి. ఓని బాలాజీ అనే రైతు గమనించి కుక్కలను తరిమివేశాడు. గాయాలైన జింకను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌ శివరాంకు అప్పగించాడు. విషయం తెలుసుకున్న ఎఫ్‌ఆర్వో రాథోడ్‌ రమేశ్‌, డీఎఫ్‌ఆర్వో ఇర్ఫానొద్దీన్‌ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. చికిత్స నిమిత్తం జింకను భైంసాకు తీసుకువెళ్లారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య



ఉమాకాంత్‌ (ఫైల్‌)

తలమడుగు: మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. ఏఎస్సై గంగధార్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మొదపు ఉమాకాంత్‌ (32) పెయింటింగ్‌ వర్క్‌ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొద్దికాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో మద్యం మత్తులో శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

‘ఐటీ టవర్‌’పై ఆనందహేల



సంబరాలు జరుపుకొంటున్న ఐటీ ఉద్యోగులు

- పరిపాలన అనుమతులు రావడంపై సంబురాలు
- కేక్‌ కట్‌ చేసిన ఐటీ ఉద్యోగులు

ఆదిలాబాద్‌: జిల్లాలో ఐటీ టవర్‌ నిర్మించనుండగా ఐటీ ఉద్యోగులు సంబురపడుతున్నారు. ఐటీ టవర్‌ నిర్మాణానికి గురువారం ప్రభుత్వం నుంచి పరిపాలన అనుమతులు వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఐటీ కంపెనీ బీడీఎన్టీ ల్యాబ్‌ సంస్థలో ఉద్యోగులు, సిబ్బంది కేక్‌ కట్‌ చేశారు. ఈ సందర్భంగా సంస్థ ఎండీ ప్రణవి మాట్లాడారు. ఐటీ టవర్‌ నిర్మాణంతో జిల్లాలో కొత్త ఐటీ కంపెనీలు నెలకొల్పే అవకాశం ఉందన్నారు. అలాగే ఐటీ కంపెనీల నిర్వహణకు అవసరమైన అన్నిరకాల సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. దీంతో మెరుగైన ఐటీ సేవలు అందించవచ్చని తెలిపారు. ఐటీ ఉద్యోగులు ఆహ్లాదకరమైన వాతావరణంలో విధులు నిర్వర్తించవచ్చన్నారు. జిల్లాలో ఐటీ టవర్‌ నిర్మాణంపై పలువురు ఐటీ ఉద్యోగులు వారి అభిప్రాయాలు సాక్షితో పంచుకున్నారు.

నైపుణ్యాలు మెరుగుపర్చుకోవచ్చు



ఆదిలాబాద్‌ లాంటి ద్వితీయ శ్రేణి పట్టణంలోనూ ఐటీ కంపెనీ ఏర్పాటవుతుందని ఊహించలేదు. ఐటీ కంపెనీ ఏర్పాటు అవ్వడమే కాకుండా ప్రస్తుతం ఐటీ టవర్‌ నిర్మాణానికి సంబంధించి కూడా నిధులు మంజూరు కావడం హర్షణీయం. ఐటీ టవర్‌ నిర్మాణంతో నూతన ఐటీ కంపెనీల ఏర్పాటుతో ఐటీ ఉద్యోగులు తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకోవచ్చు. ఐటీ కంపెనీకి అవసరమైన అన్ని సదుపాయాలు ఐటీ టవర్‌ నిర్మాణంతో సమకూరుతాయి.

– శృతి, బీడీఎన్టీ ల్యాబ్‌, అసిస్టెంట్‌ మేనేజర్‌

అన్ని రంగాల్లో అభివృద్ధి



గతంలో ఐటీ కంపెనీలు హైదరాబాద్‌, బెంగళూరు, ముంబై లాంటి మెట్రో నగరాల్లోనే ఏర్పాటయ్యేవి. ప్రభుత్వ ప్రోత్సాహంతో పట్టణాల్లోనూ కంపెనీల ఏర్పాటుకు పలువురు ముందుకువస్తున్నారు. సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగాలు చేయడానికి సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా, సొంత ఊరిలోనే ఉద్యోగాలు చేసుకునే సౌలభ్యం దక్కింది. ఐటీ టవర్‌ నిర్మాణంతో ఐటీ సేవలతో సేవా, వాణిజ్యం, వ్యవసాయం లాంటి అన్ని రంగాలు అభివృద్ధి చెందుతాయి.

– స్నిగ్ధ, బ్రాహ్మణవాడ, ఐటీ ఉద్యోగి

వెలుగులోకి వినూత్న ఆవిష్కరణలు



ఆదిలాబాద్‌ జిల్లాలో ఐటీ టవర్‌ నిర్మాణంతో ఎంతో మంది యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయి. జిల్లాలో ఐటీ కంపెనీ ఏర్పాటైనా.. ప్రారంభంలో కొన్ని ఇబ్బందులు తప్పలేదు. టవర్‌ ఏర్పాటైతే విద్యుత్‌ సౌకర్యం మెరుగవుతుంది. ఫలితంగా ఐటీ సేవలు నిరాటంకంగా కొనసాగుతాయి. కొత్త స్టార్టప్‌ సంస్థలతో వినూత్నమైన ఆవిష్కరణలు వెలుగులోకి వస్తాయి.

– ఉజ్వల, ఫిల్టర్‌బెడ్‌ కాలనీ, ఐటీ ఉద్యోగి

‘చాకిరేవు’కు వెలుగు



రూ.లక్ష చెక్కు ఇస్తున్న బాలకృష్ణ, పవన్‌కల్యాణ్‌



షోలో మాట్లాడుతున్న చాకిరేవు ఆదివాసీ గిరిజనులు

- బాలకృష్ణ అన్‌స్టాపబుల్‌ షోలో చాకిరేవు గ్రామ ప్రస్తావన
- గ్రామానికి రూ.లక్ష చెక్కు
- షో తరఫున సోలార్‌ సిస్టం ఏర్పాటు చేయిస్తామని హామీ

పెంబి: చాకిరేవు.. నిర్మల్‌ జిల్లా పెంబి మండలంలోని మారుమూల గ్రామం. ఈ గ్రామం అటవీ ప్రాంతంలో ఉండగా రోడ్డు, కరెంట్‌, తాగునీటి సౌకర్యం కూడా లేదు. కనీస సౌకర్యాలు కల్పించాలని గతంలో ఈ గ్రామ ఆదివాసీ గిరిజనులు గ్రామం నుంచి నిర్మల్‌ జిల్లా కేంద్రానికి 70కిలో మీటర్లు పాదయాత్ర నిర్వహించి కలెక్టర్‌కు సమస్యలు తెలిపారు. కనీస వసతులు కల్పించేవరకూ కలెక్టర్‌ కార్యాలయం నుంచి కదలబోమని భీష్మించారు. అక్కడే కూర్చొని దీక్ష చేపట్టారు. దీంతో కలెక్టర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు మారుమూల చాకిరేవుకు గ్రామానికి పరుగులు తీసి గిరిజనుల సమస్యలు తెలుసుకున్నారు. వెంటనే తాగేందుకు బోర్లు వేయడంతో గ్రామస్తులు దీక్ష విరమించి గ్రామానికి వెళ్లారు. పట్టు వీడకుండా కనీస వసతుల కోసం 70కిలో మీటర్లు నడిచి తాగునీరు తెచ్చుకుని రాష్ట్రంలో హాట్‌టాపిక్‌గా పెంబి మండల, చాకిరేవు గ్రామం నిలిచింది. దీంతో పాటు హీరో బాలకృష్ణ నిర్వహిస్తున్న అన్‌స్టాపబుల్‌ (ఆహ) ప్రోగ్రాం నిర్వాహకులు గ్రామస్తులను డిసెంబర్‌ 26న ఆహ్వానించారు. కార్యక్రమానికి సినీనటుడు పవన్‌కళ్యాణ్‌ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి తోడసం శంభు గ్రామానికి చెందిన గ్రామ పటేల్‌ లింభారావ్‌ పటేల్‌, జైత్‌రావు, జైతు ఈ ప్రోగ్రాంకు వెళ్లి గ్రామంలోని గిరిజనుల దీనస్థితిని వివరించారు. దీంతో గ్రామస్తులకు ఆహ ప్రోగ్రాం నుంచి రూ.లక్ష చెక్కును బాలకృష్ణ, పవన్‌ కళ్యాణ్‌ అందజేశారు. త్వరలో గ్రామానికి వెలుగు నిచ్చేందుకు సోలార్‌ సిస్టమ్‌ ఏర్పాటు చేయిస్తామని ప్రోగ్రాం తరఫున హామీ ఇచ్చారు. గ్రామాభివృద్ధికి రూ.లక్ష చెక్కు, చీకటిలో మగ్గుతున్న చాకిరేవు గ్రామానికి వెలుగునిచ్చేందుకు సోలార్‌ సిస్టం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్న అన్‌స్టాపబుల్‌ (ఆహ) ప్రోగ్రాం నిర్వాహకులు, హీరో బాలకృష్ణకు గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు.

సైబర్‌ మోసానికి గురైన మరో వ్యక్తి

- క్రెడిట్‌కార్డు నుంచి రూ.49వేలు మాయం

ఆదిలాబాద్‌టౌన్‌: సైబర్‌ మోసగాళ్ల ఆగడాలు రోజురోజుకూ పెరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికే జిల్లాలో అనేకమంది మోసపోయిన విషయం తెలిసిందే. గత నెల చివరి వారంలో ఓ వ్యక్తి క్రెడిట్‌కార్డు ద్వారా డబ్బులు మాయం కాగా, ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆదిలాబాద్‌ పట్టణంలోని సుందరయ్యనగర్‌కు చెందిన షాకీర్‌కు గతనెల 31న ఫోన్‌కు కాల్‌ వచ్చింది. ఆయన అందుబాటులో లేకపోవడంతో ఆయన భార్య ఫోన్‌లిఫ్ట్‌ చేసింది. సైబర్‌ మోసగాళ్లు క్రెడిట్‌ పాయింట్లు యాడ్‌ అవుతాయని చెప్పారు. అది డబ్బుల రూపంలో అకౌంట్‌లో జమ అవుతాయని, ఫోన్‌కు లింక్‌ పంపుతామని పేర్కొన్నారు. దీంతో ఆమె ఆ లింక్‌ను ఓపెన్‌ చేయడంతో క్రెడిట్‌కార్డు నుంచి రూ.49,644 మాయం అయ్యాయి. దీనికి సంబంధించి ఫోన్‌కు మెస్సేజ్‌ రావడంతో ఆమె ఖంగుతింది. ఈ విషయాన్ని తన భర్తకు తెలియజేయడంతో ఆయన యాక్సిస్‌ బ్యాంక్‌కు వెళ్లి వివరించారు. ఇదిలా ఉండగా గురువారం సాయంత్రం టూటౌన్‌ పోలీస్‌స్టేషన్‌లో, ఆన్‌లైన్‌ ద్వారా సైబర్‌ క్రైమ్‌కు కూడా ఫిర్యాదు చేశాడు.

లింబారావుకు మెరుగైన వైద్యం అందించాలి

- మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు భుజంగ్‌రావు



లింబారావును పరామర్శిస్తున్న భుజంగ్‌రావు

నార్నూర్‌: అటవీశాఖ అధికారి చేతిలో గాయపడిన లింబారావు ఆరోగ్యం క్షీణిస్తోందని, అతడికి మెరుగైన వైద్యం అందించాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భుజంగ్‌రావు కోరారు. శుక్రవారం గాంధీ ఆస్పత్రి నుంచి లింబారావును వైద్యులు డిశ్చార్జి చేస్తున్న విషయాన్ని తెలుసుకున్న అతడు ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లింబారావు నయం కాకున్నా ఎందుకు డిశ్చార్జి చేస్తున్నారని వైద్యులను అడిగితే సరైన సమాధానం ఇవ్వడం లేదన్నారు. బాధితుడి నడుము, కాళ్లు, చేతులు పని చేయడం లేదని తెలిపారు. ఉట్నూర్‌ అటవీశాఖ కార్యాలయాన్ని ఆదివాసీలు ముట్టడించిన సమయంలో ఎఫ్‌డీఎఫ్‌వో పూర్తి స్థాయిలో వైద్యం అందిస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు బాధితుడిని చూడలేదన్నారు. మెరుగైన వైద్యం అందించాల్సిన సమయంలో ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేయడమేమిటని ప్రశ్నించారు. లింబారావుకు ఏదైనా జరిగితే అటవీశాఖ అధికారులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. వెంటనే అధికారులు స్పందించి ప్రైవేట్‌లో కార్పొరేట్‌ వైద్యం అందించాలని డిమాండ్‌ చేశారు. ఆయన వెంట బలాన్‌పూర్‌ సర్పంచ్‌ ఆత్రం పరమేశ్వర్‌ తదితరులున్నారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

ఇచ్చోడ: సాథ్‌నంబర్‌ గ్రామానికి చెందిన బిషే దిగంబర్‌ (45) మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇన్‌చార్జి ఎస్సై నీరేశ్‌, మృతుడి కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. సాథ్‌నంబర్‌కు చెందిన దిగంబర్‌ కొద్ది రోజులుగా మద్యానికి బానిసై జులాయిగా తిరుగుతున్నాడు. గురువారం అతిగా మద్యం సేవించి రాత్రి 8గంటల ప్రాంతంలో తన పంటపొలం వద్ద కు వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మధ్యాహ్నం వరకు దిగంబర్‌ ఇంటికి రాక పోవడంతో ఆందోళన చెందిన కుటుంబీకులు పంటపొలం వద్దకు వెళ్లి చూడగా అప్పటికే దిగంబర్‌ మృతదేహం కనిపించింది. భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వెంకటాపూర్‌లో పత్తి దగ్ధం

భీమిని: వెంకటాపూర్‌ గ్రామంలో గురువారం రాత్రి చదువుల శ్రీనివాస్‌కు చెందిన 20 క్వింటాళ్ల పత్తి దగ్ధమైంది. గ్రామస్తులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్‌ తన చేను నుంచి సేకరించిన సుమారు 280 క్వింటాళ్ల పత్తిని ధర లేక ఇంటి వద్ద నిల్వ చేసుకున్నాడు. గురువారం రాత్రి పత్తి నుంచి మంటలు వ్యాపించాయి. గ్రామస్తులు నీళ్లు చల్లి మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో శ్రీనివాస్‌కు చెందిన సుమారు రూ.1.80లక్షల విలువైన పత్తి పూర్తిగా దగ్ధమైంది. ఘటనా స్థలాన్ని తాండూర్‌ సీఐ జగదీశ్‌, ఎస్సైలు వెంకటేశ్‌, సురేశ్‌ పరిశీలించారు. 20 రోజుల వ్యవధిలో గ్రామంలో ముగ్గురు రైతులకు చెందిన పత్తికి మంటలు అంటుకోవడం అనుమానాలకు తావిస్తోంది. ఇదే అనుమానం వ్యక్తంజేస్తూ బాధితుడు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విధి నిర్వహణలో ఆగిన ఊపిరి

- గుండెపోటుతో విద్యుత్‌ విజిలెన్స్‌ అధికారి మృతి



షేక్‌ కరీమొద్దీన్‌ (ఫైల్‌)

ఉట్నూర్‌రూరల్‌: మండలంలోని కుమ్మరితాండ గ్రామంలో శుక్రవారం విధులు నిర్వహిస్తున్న విద్యుత్‌ శాఖ విజిలెన్స్‌ అధికారి షేక్‌ కరీమొద్దీన్‌ (55) గుండెపోటుతో మృతి చెందాడు. తోటి సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్‌ విద్యుత్‌ ప్రధాన కార్యాలయం నుంచి తనిఖీలు చేయడానికి కుమ్మరితాండ గ్రామానికి కరీమొద్దీన్‌ వచ్చాడు. తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో హఠాత్తుగా గుండెపోటు రాగా అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. వెంటనే తోటి ఉద్యోగులు ఉట్నూర్‌ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరీక్షలు నిర్వహించిన వైద్యులు కరీమొద్దీన్‌ మృతి చెందినట్లు నిర్ధారించారు. కరీమొద్దీన్‌ మృతిపై విద్యుత్‌ సిబ్బంది సంతాపం తెలిపారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరికి గాయాలు

ఆదిలాబాద్‌టౌన్‌: పట్టణంలోని తెలంగాణ చౌక్‌ సమీపంలో శుక్రవారం ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పట్టణంలోని శ్రీరాం కాలనీకి చెందిన సంజీవ్‌ బైక్‌ పైనుంచి కిందపడ్డాడు. దీంతో తల, కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వైద్యం కోసం రిమ్స్‌ ఆసుపత్రికి తరలించారు.

లారీ ఢీకొని యువకుడి దుర్మరణం

భైంసారూరల్‌: భైంసా–బాసర ప్రధాన రాహదారిపై దేగాం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సాయిపటేల్‌ (30) అనే యువకుడు మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి ద్విచక్రవాహనంపై సాయిపటేల్‌ దేగాం గ్రామానికి వెళ్తున్నాడు. అదే సమయంలో భైంసా నుంచి నిజామాబాద్‌ వెళ్తున్న లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ద్విచక్రవాహనం నడుపుతున్న సాయి పటేల్‌ కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

అనారోగ్యంతో గురుకుల విద్యార్థిని మృతి

- ఆసుపత్రి వద్ద బంధువుల ఆందోళన



మహిత (ఫైల్‌)



ఆసుపత్రివద్ద రోదిస్తున్న బంధువులు

సారంగాపూర్‌: మండలంలోని జామ్‌ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో శుక్రవారం విద్యార్థిని ఇప్ప మహిత (12) అనారోగ్యంతో మృతి చెందింది. తోటి విద్యార్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోన్‌ మండలం పాక్‌పట్ల గ్రామానికి చెందిన మహిత జామ్‌ గురుకుల పాఠశాలలో ఐదోతరగతి చదువుతోంది. గురువారం సాయంత్రం తోటి విద్యార్థులతో ఆడుకుంటూనే అకస్మాత్తుగా కిందపడగా కాలికి గాయమైంది. శుక్రవారం ఉదయం యోగా చేసిన అనంతరం కళ్లుతిరిగి పడిపోయింది. మహితను పాఠశాల ఆవరణలోని ఆసుపత్రి గదికి తరలించారు. ఏఎన్‌ఎం సూచన మేరకు ఆటోలో నిర్మల్‌ ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందింది. ఈ ఘటనపై గురుకులాల ఆర్‌సీఓ మేరీ ఏసుపాదం పాఠశాలలో విచారణ చేపట్టారు.

ఆసుపత్రి ఎదుట బంధువుల ఆందోళన

మహిత మృతి విషయాన్ని పాఠశాల ప్రిన్సిపాల్‌ రమాకళ్యాణి ఆమె తల్లి సరితకు తెలుపగా బంధువులు, గ్రామస్తులు అధికసంఖ్యలో ఆసుపత్రికి చేరుకున్నారు. మహిత మృతికి పాఠశాల సిబ్బందే కారణమని ఆరోపిస్తూ ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. పోలీసుల చొరవతో ఆందోళన విరమించారు.

పాఠశాల వద్ద విద్యార్థి సంఘాలు..

బీజేపీ మండలాధ్యక్షుడు కరిపె విలాస్‌, ఏబీవీపీ నాయకుడు ఒడిసెల అర్జున్‌, పీడీఎస్‌యూ జిల్లా సహ కార్యదర్శి నవీన్‌, భోజన్న తదితరులు పాఠశాల ఎదుట ఆందోళనకు దిగారు. లోనికి వెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. సోన్‌ సీఐ రాంనర్సింహారెడ్డి, నర్సాపూర్‌, దిలావర్‌పూర్‌ ఎస్సైలు వారిని అరెస్ట్‌ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. విద్యార్థిని మృతికి అసలు కారణం దాచి పెట్టి అనారోగ్యంతో మృతి చెందినట్లు పాఠశాల సిబ్బంది చెప్పడాన్ని ఖండించారు. వెంటనే విద్యార్థిని మృతిపై విచారణ చేపట్టాలని, బాధిత కుటుంబానికి రూ.10వేల పరిహారం ఇవ్వాలని బీజేపీ నాయకుడు రావుల రాంనాథ్‌ డిమాండ్‌ చేశారు. బీజేపీ నాయకుడు డాక్టర్‌ మల్లికార్జున్‌రెడ్డి పాఠశాలకు వెళ్లి విద్యార్థిని మృతిపై ఆరా తీశారు. మహిత తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. కాగా, విద్యార్థి తండ్రి ఉపాధి కోసం దుబాయ్‌కి వెళ్లాడు.

వైభవం.. వెంకన్న కల్యాణం

- అధికసంఖ్యలో హాజరైన భక్తులు



కల్యాణం నిర్వహిస్తున్న పండితులు



కల్యాణ మహోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

తాంసి: భీంపూర్‌ మండలం పిప్పల్‌కోటి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం నిర్వహించిన వేంకటేశ్వరస్వామి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. ఆలయ ఎనిమిదో వార్షికోత్సవంలో భాగంగా మూడురోజులుగా ఆలయంలో బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆలయంలో ప్రతిరోజూ హోమం, అర్చన, హారతి నిర్వహిస్తూ భజన, సంకీర్తనలు చేస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో చివరిరోజు వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ మండపంలో శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి, పద్మావతిదేవి కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. ముందుగా గ్రామంలో డప్పుచప్పుళ్లతో లక్ష్మీవేంకటేశ్వరస్వామి, పద్మావతిదేవి ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం పండితులు నేరేళ్ల కళ్యాణాచార్యులు, రాంగోపాల్‌వర్మ మంత్రోచ్చారణల మధ్య శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని భక్తజనుల మధ్య వేడుకగా నిర్వహించారు. కల్యాణాన్ని వీక్షించడానికి నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్‌జాదవ్‌, భీంపూర్‌ జెడ్పీటీసీ సుధాకర్‌, ఎమ్మెల్యే తనయుడు రాథోడ్‌ విశ్వజిత్‌, కొండయ్య చౌదరి, దేవన్న తదితరులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో ఏర్పాటు చేసిన కల్యాణాన్ని వీక్షించడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి, జిల్లా కేంద్రం, మహారాష్ట్ర నుంచి అధికసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. వేంకటేశ్వరస్వామిని దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధికసంఖ్యలో రాగా ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. బ్రహ్మోత్సవాలకు వచ్చిన భక్తులకు ఆలయకమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పాఠశాల విద్యార్థినులు చేసిన నృత్యాలు భక్తులను ప్రత్యేకంగా అలరించాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రమణారెడ్డి, సర్పంచ్‌ కళ్యాణిగంగయ్య, వైస్‌ ఎంపీపీ లస్మన్న, గ్రామపెద్దలు అనిల్‌, నాగయ్య, స్వామి, అఫ్రోజ్‌, సంతోష్‌ తదితరులు పాల్గొన్నారు.



మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం బొక్కలగుట్ట గ్రామశివారులోని గాంధారి మైసమ్మ ఖిల్లా గుట్ట ప్రతిబింబం శుక్రవారం చెరువు నీటిలో చూడముచ్చటగా కనిపించింది. ఇటుగా వెళ్లేవారు ఆగి మరీ.. ఈ చిత్రాన్ని చూడడం ‘సాక్షి’ కంటపడింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్‌, మంచిర్యాల